# గుండెలోతుల్లోనుంచి ప్రవాహంలా పొంగుకొచ్చిన ఆనందం!

గోటేటి వేంకటేశ్వరరావు





శ్రీరామకృష్ణ మిషన్ బాలుర ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2014, ముచ్చటగా మూడవసారి మొన్న ఫిబ్రవరి 16న జరిగింది. ఈసారి శారదమిషన్ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థినులు ఈ సమావేశానికి రావడం, అందునా బాలుర పాఠశాలకు రావడం వారికిది మొట్టమొదటి కలయిక కావడం, ఎంతో ఆనందకారకమైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటల దాకా సాగింది. అప్పటికి చాలమంది వెళ్ళలేక వెళ్ళలేక ఇళ్ళకు వెళ్ళారు. మళ్ళీ ఎప్పుడు కలుస్తామని బాధతో వెళ్ళారు. దరిదాపుగా 135 విద్యార్థి విద్యార్థినులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్న ఆ సమావేశం కడు రమ్యంగా సాగింది. ఈ సమావేశానికి శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమ ప్రస్తుత కార్యదర్శి శ్రీ పద్మస్థానందజీ మహరాజ్ ప్రత్యేక అతిథిగా వచ్చి తన ఆశీః పూర్వక ప్రసంగాన్ని అందజేశారు. తెలుగు విద్యార్థుల కోరికమేరకు చెన్నై ట్రిప్లికేన్ ఐస్‌హౌస్ లోని సెంటర్‌లో తెలుగుభాషతోపాటు మరికొన్ని భాషలు నేర్పిస్తామని చెప్పారు. వారి స్కూల్లో చదువుకున్న విద్యార్థులు ఇంత గొప్పవారవటం చూసి చాలా ఆనందంగా ఉందని, మీ అందరికి శ్రీరామకృష్ణ పరమహంస, మాతా శారదదేవి, స్వామి వివేకానంద ఆశీస్సులు ఎల్లప్పుడూ వుంటాయని చెప్పారు. ఇంకా ఈ సమావేశంలో 1971 నుంచి 1979 వరకు చదువుకున్న తెలుగు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అప్పుడు వున్న గురువులు శ్రీ గోపాలచారిగారు, శ్రీరాధాకృష్ణగారు, శ్రీ సత్యనారాయణరాజు గారు శ్రీ రామమూర్తిగారు, శ్రీ అంకయ్యగార్లు పాల్గొని వారి అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ ఈ విధంగా అందరు సమావేశమవ్వటం సంతోషదాయకమని తమ వద్ద విద్యనభ్యసించిన పిల్లలు ప్రయోజకులవ్వటం కన్న తమకు వేరు ఆనందంలేదని చెపుతూ ఆశీః ప్రసంగం చేశారు. ఇంక ఒక్కొక్క సంవత్సరం బ్యాచ్ పిల్లలు ఒక్కొక్కరూ తమ అనుభవాలను, అనుభూతులను సహవిద్యార్థులతో పంచుకున్నారు. ఇందులో ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన కళ్యాణరామన్, దుబాయ్ నుంచి వచ్చిన సీతారామ్, హైదరాబాద్ నుంచి వచ్చిన విజయ, పూర్వపు వాలీబాల్ ప్లేయర్ (ప్రస్తుతం బ్యాడ్మింటన్ సెన్సేషన్ పి.వి. సింధు తల్లి) ఘంటసాల వెంకటేశ్వరరావుగారి అమ్మాయి సుగుణ, పూర్వపు స్కూల్ విద్యార్థిని, ప్రస్తుతం మీనాక్షి కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి రమణమ్మ, ప్రముఖ హాస్యనటులు బాలకృష్ణ కుమార్తె, శంకరాభరణం సినీ నిర్మాత ఏడిద విశ్వమోహన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సమావేశంలో స్కూల్ ప్రార్థన సహనాభవతు, తరువాత గురువులను స్తుతిస్తూ శ్రీ ఆదిశంకరులవారి గురు అష్టకాన్ని చిన్నారులు శ్రేయ, శ్రీవిద్య, ఐశ్వర్య, నికిత ఆలపించారు. చిరంజీవి అజయ్ మాండలిన్, షివిక వారి కూచిపూడి నృత్యం శ్రీమతి సత్యప్రియగారి పర్యవేక్షణలో, శ్రీమతి పద్మ లలితసంగీతాన్ని వచ్చిన విద్యార్థులందరూ విని, కని ఆనందించారు.













## ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలు

ఓరేయ్ ఎలావున్నావు? నేనెవరో చెప్పుకో? గుర్తు పట్టావా? ఏంచేస్తున్నావు? **లేటుగా తెలిసింది. ఈసారి ఇంకొంతమందిని తీసుకొస్తాం** వంటి మాటలతో హాలంతా పలకరింపులతో నిండిపోయింది. కొంతమంది వారు చదువుకున్న క్లాస్‌రూమ్‌లకెళ్ళి అక్కడ ఆ బల్లల మీద కూర్చొని మురిసిపోయారు. కొంతమంది విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేస్తూ మీ వల్లే మేము ఇంత గొప్ప వారమయ్యాం అంటూ ఆనందబాష్పాలతో కృతజ్ఞతాపూర్వకంగా వివరించారు.

## శారద బాలికల పాఠశాల విద్యార్థినుల హల్‌చల్

ఈ సంవత్సరము ప్రత్యేకంగా శారదమిషన్ బాలిక పాఠశాల పూర్వవిద్యార్థులు







ఈ సమావేశంలో పాల్గొనడం, వీరు బాలురుతో చక్కగా కలిసిపోయి సందడి చేసారు. సహవిద్యార్థినులతో ఫోటోలు తీసుకుంటూ, పిల్లల గురించి, ఇతర విషయాలు ముచ్చటిస్తూ సరదగా గడిపారు.

ఇంత గొప్పగా ఏర్పాట్లు చేసిన ఆవుల దామోదర్, కామాక్షి కృష్ణప్రసాద్, జీవి రాంగోపాల్, గోటేటి వెంకటేశ్వరరావు, ముక్కు సుబ్బారావు, పార్థసారథి, సురేంద్రలను అందరూ అభినందించారు. అలాగే ఈసారి శారదవిద్యాలయ విద్యార్థినులను పాల్గొనేటట్లు చేసిన రాగిణి, పద్మావతి, సుగుణ, కామేశ్వరిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ●